సాక్షి కామారెడ్డి

ఆదివారం । 8 । అక్టోబర్ । 2023



అన్ని రంగాల్లో అభివృద్ధి
బాన్సువాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తున్నామని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.
- 8లో ▸



దళితబంధు కోసం ఆందోళన
అర్హులకు దళితబంధు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పలు గ్రామాలలో దళితులు ఆందోళనలు కొనసాగిస్తున్నారు.
- 9లో ▸

గరిష్టం/కనిష్టం
35.6 /18.3

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. పొగమంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

డీఈఎల్‌ఈడీ, డీపీఎస్‌ఈ పరీక్ష ఫీజు చెల్లించండి

కామారెడ్డి అర్బన్: డీఈఎల్‌ఈడీ, డీపీఎస్‌ఈ కోర్సులు చదువుతున్న 2022–24 బ్యాచ్ విద్యార్థులు ఈనెల 27వ తేదీలోగా మొదటి సంవత్సరం వార్షిక పరీక్ష రుసుం చెల్లించాలని నిజామాబాద్ డైట్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. నవంబర్ 3 వరకు రూ. 50 అపరాధ రుసుంతో పరీక్ష ఫీజు చెల్లించడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. 2019–21 బ్యాచ్‌లో ఒక సబ్జెక్ట్ ఫెయిల్ అయిన వారు సైతం పరీక్ష రుసుం చెల్లించి ఈ అవకాశం ఉపయోగించుకోవాలని సూచించారు.

ఏపీవోపై సస్పెన్షన్ వేటు

బిచ్కుంద: మండల ఉపాధి హామీ ఏపీవో అన్నపూర్ణను డీఆర్‌డీఏ అధికారులు సస్పెండ్ చేశారని ఎంపీడీవో ఆనంద్ తెలిపారు. ఏపీవో అన్నపూర్ణ విధి నిర్వహణలో పూర్తిగా విఫలమయ్యారని, దీనిపై గతంలో నోటీసులు ఇచ్చినా పద్ధతి మార్చుకోకపోవడమే కాకుండా నోటీసుకు వివరణ కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. కూలీలకు పనులు కల్పించడంలో 70 శాతం వెనకబడి ఉన్నారన్నారు. ఉపాధి పనుల పురోగతి తెలుసుకునేందుకు జిల్లా, మండల అధికారులు ఫోన్ చేసినా స్పందించడం లేదన్నారు. దీంతో ఉన్నతాధికారులు ఆమెపై సస్పెన్షన్ వేటు వేశారని పేర్కొన్నారు. ఏపీవో ఇన్‌చార్జి బాధ్యతలను త్వరలో ఇతరులకు ఇస్తామన్నారు.

సభతో ఇబ్బందిపడ్డ ఇంటర్ విద్యార్థులు



కామారెడ్డి టౌన్: జిల్లాకేంద్రంలో బీఆర్‌ఎస్ సభతో కామారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. కళాశాల పక్కనే మంత్రి కేటీఆర్ సభ నిర్వహించారు. డీజే సౌండ్‌తో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. మరోవైపు కళాశాలలోనే ఓ తరగతి గదిలో సభకు వచ్చిన వారికి భోజనాలు ఏర్పాటు చేశారు. క్లాసులు జరుగుతుంగా మరోవైపు భోజనాల హడావుడి ఉండడంతో లెక్చరర్లతో పాటు, విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.

ఎమ్మెల్యేను కలిసేందుకు రైతుల యత్నం

- అడ్డుకున్న పోలీసులు



నాగిరెడ్డిపేట: చాలా ఏళ్లుగా తాము సాగు చేసుకుంటున్న అసైన్‌మెంట్ భూములకు పట్టాలు ఇవ్వాలని ఎమ్మెల్యే సురేందర్‌కు విన్నవించడానికి వెళ్లిన రైతులను శనివారం నాగిరెడ్డిపేట పోలీసులు అడ్డుకున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటిస్తున్నారని తెలుసుకున్న లింగంపల్లికలాన్, తాండూర్ గ్రామాలకు చెందిన పలువురు రైతులు మండలకేంద్రానికి తరలివచ్చారు. ఎమ్మెల్యే వాహనం వచ్చే ప్రధాన రహదారిపై నిల్చున్న రైతులు ఎక్కడ ఎమ్మెల్యేను అడ్డుకుంటారేమోననే అనుమానంతో ముందు జాగ్రత్తగా నాగిరెడ్డిపేట ఎస్సై రాజు ఆధ్వర్యంలో పోలీసులు అక్కడికి చేరుకొని అడ్డుకున్నారు. తాము ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యను విన్నవించుకుంటామని ఎంతచెప్పినా పోలీసులు వినకుండా వారిని అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్తత నెలకొంది. కాగా కామారెడ్డిలో జరిగిన మంత్రి కేటీఆర్ సభలో పాల్గొనేందుకు ఎమ్మెల్యే సురేందర్ తన పర్యటనను అర్ధాంతరంగా రద్దు చేసుకొని వెళ్లిపోయారు. దీంతో రైతులు ఎమ్మెల్యేను కలవలేకపోయారు. తమ భూములకు పట్టాలు ఇచ్చే వరకు ఆదివారం నుంచి మండలకేంద్రంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని రైతులు తెలిపారు.



మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, వేదికపై ఎంపీ బీబీ పాటిల్, మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

రంగంలోకి రామన్న!

- కామారెడ్డిలో కేసీఆర్ గెలుపు కోసం ప్రయత్నాలు
- పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం
- నేతలకు చురకలు.. అందరినీ కలుపుకుని వెళ్లాలని హితవు
- పోలింగ్ బూత్‌కో సీనియర్ నేతకు ఇన్‌చార్జి బాధ్యతలివ్వాలని సూచన
- ప్రతిపక్షాలపై విమర్శలు
- మంత్రి పర్యటనతో గులాబీ శ్రేణుల్లో రెట్టించిన ఉత్సాహం



సభలో పాల్గొన్న పార్టీ శ్రేణులు

సాక్షి, కామారెడ్డి: బీఆర్‌ఎస్ కామారెడ్డి అభ్యర్థిగా సీఎం కేసీఆర్‌ను ప్రకటించడంతో ఆ పార్టీలో ఉత్సాహం కనిపించింది. అయితే నేతల మధ్య విభేదాలుండడంతో వారిని సమన్వయం చేసేందుకు మంత్రి కేటీఆర్ చొరవ చూపుతారని శ్రేణులు ఆశించాయి. కానీ అభ్యర్థిని ప్రకటించి నెల రోజులైనా ఎలాంటి సమావేశాలు లేకపోవడంతో స్తబ్ధత ఏర్పడింది. ఈ నేపథ్యంలో కేటీఆర్ స్పందించారు. శనివారం కామారెడ్డిలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో దిశానిర్దేశం చేశారు. దీంతో క్యాడర్‌లో మళ్లీ జోష్ వచ్చింది.

ఇన్‌చార్జీలుగా ముగ్గురు..

కామారెడ్డి ఎన్నికల ఇన్‌చార్జి ఎవరన్న విషయంపై మంత్రి కేటీఆర్ స్పష్టత ఇచ్చారు. తనతో పాటు మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఇన్‌చార్జీలుగా ఉంటారన్నారు. నియోజకవర్గంలో 266 పోలింగ్ బూత్‌లు ఉండగా.. ప్రతి బూత్‌కు ఒక సీనియర్ నేతకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తామన్నారు. నేతలు విభేదాలను పక్కన పెట్టి, కేసీఆర్‌కు రికార్డు స్థాయి మెజారిటీ అందించేందుకు కృషి చేయాలన్నారు.

గంపపై పొగడ్తలు..

గంప గోవర్ధన్‌ను కేటీఆర్ పొగడ్తలతో ముంచెత్తారు. 2009లో గంప ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి బీఆర్‌ఎస్‌లో చేరారని, ఉప ఎన్నికల్లో ఆయనను గెలిపించుకున్నామని, అప్పటి నుంచి ఆయన విజయాన్ని ఎవరూ ఆపలేకపోయారని పేర్కొన్నారు. కామారెడ్డి మరింత అభివృద్ధి చెందాలన్న తపనతో ఆయన సీఎంను ఇక్కడికి ఆహ్వానించారన్నారు. కేసీఆర్ గెలుపుకోసం తాను కార్యకర్తలా పనిచేస్తానని చెప్పిన గొప్ప వ్యక్తి అంటూ గంపను పొగిడారు. గంపకు ఎమ్మెల్యే పదవికంటే మంచి గుర్తింపు వస్తుందన్నారు.

ఊరికో మేనిఫెస్టో..

సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్నందున ప్రతి ఊరుతోపాటు పట్టణంలో వార్డుకో మేనిఫెస్టో రూపొందించుకుని మొత్తంగా నియోజకవర్గానికి ప్రత్యేక మేనిఫెస్టో తయారు చేసుకుందామని కేటీఆర్ పేర్కొన్నారు. ''తెలంగాణ సాధించుకున్న తర్వాత కామారెడ్డి జిల్లా అయ్యింది. ఇక్కడికే కలెక్టర్, ఎస్పీ వచ్చారు. మెడికల్ కాలేజీ, 350 బెడ్‌లతో ఆస్పత్రి ఏర్పాటు చేసుకుంటున్నాం. వంద మందికిపైగా స్పెషలిస్టు వైద్యులు వస్తున్నారు. సూపర్ స్పెషాలిటీ వైద్యం ఇక్కడే అందుతుంది'' అని కేటీఆర్ పేర్కొన్నారు. 22 ఎకరాల్లో ఆటోనగర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముదిరాజ్ సంఘ భవనానికి స్థలంతోపాటు నిర్మాణానికి రూ.2 కోట్లు అడిగారని, ఆర్డర్ ఇస్తామని పేర్కొన్నారు. వీటిని ప్రజలకు వివరించేందుకు ఊరికో సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఉండాల్సిన అవసరం ఉందన్నారు.

పొత్తుతోనే షబ్బీర్ గెలిచాడు

తెలంగాణ ఇస్తామన్న హామీ ఇవ్వడంతో 2004 ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నామని కేటీఆర్ తెలిపారు. కామారెడ్డిలో టీఆర్‌ఎస్ బలంగా ఉన్నా గులాం నబీ ఆజాద్ ద్వారా షబ్బీర్ అలీ కేసీఆర్‌పై ఒత్తిడి తీసుకువచ్చి కామారెడ్డి నుంచి పోటీ చేశాడన్నారు. కేసీఆర్ వచ్చి ప్రచారం చేయాలంటూ నిజామాబాద్ పూలాంగ్ వద్ద షబ్బీర్ అలీ బతిమాలి, ఎన్నికల సభలో మాట్లాడించాడన్నారు. అందువల్లే షబ్బీర్ గెలిచాడన్నారు. షబ్బీర్‌అలీ మాత్రం కేసీఆర్‌ను ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతుంటాడని విమర్శించారు.

ఈ ప్రాంత ప్రజల అదృష్టం..

కేసీఆర్ పోటీ చేసే అవకాశం దక్కడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని మంత్రి పేర్కొన్నారు. సీఎం రాకతో సిరిసిల్ల, బాల్గొండ నియోజకవర్గాలు మీ ముందర చిన్నవైపోయాయన్నారు. మొన్న సిరిసిల్ల నుంచి వస్తూ మాచారెడ్డి దగ్గర ఆగి చాయ్ తాగుతూ అక్కడి యువకులతో మాట్లాడానని, ''మాదీ సీఎం నియోజకవర్గమే.. ఇక మాకు ఢోకా లేదు'' అని వారు చెప్పారన్నారు.

ఆ పార్టీల్లో వణుకు..

కామారెడ్డి నియోజకవర్గంనుంచి సీఎం కేసీఆర్ అభ్యర్థిత్వాన్ని ప్రకటించగానే కాంగ్రెస్, బీజేపీలకు వణుకు పుట్టిందని, పోటీ చేయడం ఉత్తదే అని వాళ్లకు వాళ్లే మాట్లాడుకుంటున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ గెలుపు ఖాయమైందని, రికార్డు మెజారిటీ కోసం ప్రయత్నించాలని పార్టీ శ్రేణులను కోరారు. షబ్బీర్ అలీ, బీజేపీ రెడ్డిల డిపాజిట్లు గల్లంతు చేయాలన్నారు.

కార్యక్రమాలు రద్దు..

షెడ్యూల్ ప్రకారం మంత్రి కేటీఆర్ శనివారం కామారెడ్డి పర్యటనలో వైద్యులు, న్యాయవాదులు, కుల సంఘాలతో సమావేశమవ్వాల్సి ఉంది. అయితే అనారోగ్యంతో ఆయా కార్యక్రమాలను రద్దు చేసుకుని వెళ్లిపోయారు. సభలో ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబొద్దీన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీధర్, ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్ కొమ్ముల తిర్మల్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జాహ్నవి, వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రేమ్‌కుమార్, నాయకులు నిట్టు వేణుగోపాల్‌రావ్, ఎల్.నర్సింగరావు, మిన్కూరి రాంరెడ్డి, పిప్పిరి ఆంజనేయులు, గాల్‌రెడ్డి, బాలమణి, వెంకట్‌గౌడ్, మధుసూదన్‌రావు, బల్వంతరావ్, నర్సింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డివైపు చూపు..

సీఎం కేసీఆర్ పోటీ చేస్తుండడంతో రాష్ట్రమంతా కామారెడ్డి వైపు చూస్తోందని ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఇక కామారెడ్డి దశా దిశా మారబోతున్నాయన్నారు. నాయకుల మధ్య సమన్వయ లోపాలను పరిష్కరించుకోవాలని సూచించారు. కామారెడ్డినుంచి సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉందని జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ పేర్కొన్నారు. నియోజకవర్గాన్ని వందల కోట్లతో ఇప్పటికే ఎంతో అభివృద్ధి చేసుకున్నామని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ పేర్కొన్నారు. అయినా ఇంకా ఎక్కడో లోటు కనిపిస్తోందని, కేసీఆర్ రాకతో ఇంకా అభివృద్ధి అవుతుందన్నారు. కేసీఆర్‌ను గెలుపు కోసం ఇప్పటికే 33 గ్రామపంచాయతీలు ఏకగ్రీవ తీర్మానాలు చేశాయన్నారు. ఆ తీర్మానాలను కేటీఆర్‌కు అందించారు.





జీపీల తీర్మానాలను అందిస్తున్న మాచారెడ్డి ఎంపీపీ నర్సింగ్‌రావు, మెడికల్ కాలేజీని చూపిస్తున్న గంప

మంత్రి కేటీఆర్‌కు ఘన స్వాగతం



కామారెడ్డి క్రైం: జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలోని హెలీప్యాడ్ వద్ద కేటీఆర్ హెలీకాప్టర్ ల్యాండ్ అయ్యింది. ఆయనకు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌తో పాటు కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాసరెడ్డి, అదనపు కలెక్టర్లు మను చౌదరి, చంద్రమోహన్ మొక్కలను అందజేసి స్వాగతం పలికారు.

బయటపడ్డ విభేదాలు..



బీఆర్‌ఎస్‌లో విభేదాలు మరోసారి బయటపడ్డాయి. శనివారం పట్టణంలో పార్టీ సమావేశం నేపథ్యంలో భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయితే మున్సిపల్ చైర్‌పర్సన్ జాహ్నవి, ఆమె కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో స్థానిక ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఫొటో లేకపోవడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. కొంతకాలం క్రితం విప్‌తో చైర్మన్‌కు, ఆమె కుటుంబ సభ్యులకు విభేదాలు తలెత్తాయి. దీంతో పట్టణంలో జరిగే అధికారిక కార్యక్రమాల్లో చైర్‌పర్సన్ పాల్గొనడం లేదు.

బీఆర్‌ఎస్ నాయకులను బుజ్జగించేందుకే కేటీఆర్ సభ

- ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న కల్వకుంట్ల కుటుంబం
- కేసీఆర్‌ను కామారెడ్డి ప్రజలు ఓడించడం ఖాయం
- మాజీ మంత్రి షబ్బీర్ అలీ



మాట్లాడుతున్న షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్: కామారెడ్డిలో శనివారం మంత్రి కేటీఆర్ పార్టీ కార్యకర్తల సభ పేరుతో నాయకుల బుజ్జగింపు సభ నిర్వహించారని మాజీ మంత్రి షబ్బీర్ అలీ విమర్శించారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కల్వకుంట్ల కుటుంబం ప్రజాధనాన్ని వృథా చేస్తోందని ఆరోపించారు. కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్, కవితలు పార్టీ కార్యకలాపాలకు హెలికాప్టర్‌లు వినియోగిస్తూ రూ. కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. హైదరాబాద్ నుంచి కామారెడ్డి 100 కిలోమీటర్ల దూరంలో ఉందని, రోడ్డు మార్గంలో గంటలో రావొచ్చని, అయితే రోడ్డు మీదుగా వస్తే అడుగడుగునా ప్రజలు అడ్డుకుంటారన్న భయంతో హెలీకాప్టర్‌లో వచ్చారని విమర్శించారు. గంప గోవర్ధన్‌ను బుజ్జగించడానికే గోదావరి జలాల పైప్‌లైన్ కోసం రూ. 195 కోట్లు ఇచ్చారని, ప్రజలపై ప్రేమతో కాదని పేర్కొన్నారు. కామారెడ్డిలో కేసీఆర్ పోటీకి రాక ముందే బీఆర్‌ఎస్ నాయకుల దోపిడీ మొదలైందని ఆరోపించారు. కామారెడ్డిలో బీఆర్‌ఎస్ నాయకుల కమీషన్ల పంపకాలు, కుమ్ములాటలే కేసీఆర్‌ను ఓడిస్తాయన్నారు. కామారెడ్డిలో కూలిపోయే డబుల్ బెడ్‌రూంలు పంపిణీ చేస్తున్నారని, రూ. మూడు లక్షలు తీసుకుని దళితబంధు ఇస్తున్నారని ఆరోపించారు. దేవునిపల్లిలో దళితబంధు మంజూరు కోసం ఓ బీఆర్‌ఎస్ నాయకుడు లబ్ధిదారును రూ. 3 లక్షలు అడుగుతున్న ఫోన్ సంభాషణను మీడియా సమావేశంలో వినిపించారు. అవినీతి సొమ్మును ఓటర్లకు పంచి గెలుద్దామని కేసీఆర్ అనుకుంటున్నాడని, కానీ ప్రజలు ఆయన పాలనపై విసిగిపోయారని ఇక కాంగ్రెస్‌ను గెలిపిస్తారని పేర్కొన్నారు. ప్రజాసొత్తు మెక్కేసిన కల్వకుంట్ల కుటుంబం జైలుకు పోవడం ఖాయమన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, నాయకులు పండ్ల రాజు, గూడెం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర్మరక్షణకు ముందుకురావాలి

- బజరంగ్‌దళ్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ శివరాములు
- ఎల్లారెడ్డి నుంచి నాగిరెడ్డిపేట వరకు శౌర్య జాగరణ యాత్ర



ఎల్లారెడ్డిలో శౌర్య జాగరణ మహా పాదయాత్ర ప్రారంభిస్తున్న నాయకులు

నాగిరెడ్డిపేట/ఎల్లారెడ్డి: దేశంతోపాటు ధర్మాన్ని రక్షించేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని బజరంగ్‌దళ్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ శివరాములు పిలుపునిచ్చారు. ఎల్లారెడ్డిలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్‌ల ఆధ్వర్యంలో శనివారం శౌర్య జాగరణ మహా పాదయాత్ర ప్రారంభించారు. పట్టణంలోని దొరవారి హనుమాన్ ఆలయం నుంచి నాగిరెడ్డిపేట మండలంలోని రామాలయం వరకు పాదయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా రామాలయం వద్ద శివరాములు మాట్లాడుతూ ధర్మరక్షణ కోసం హిందువులంతా సంఘటితం కావాలన్నారు. ప్రతిగ్రామంలో బజరంగ్‌దళ్ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. లవ్ జిహాద్, మతమార్పిడులను అడ్డుకోవాలని సూచించారు. కార్యక్రమాలలో ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, సొసైటీ వైస్ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, నాయకులు గోపాలకృష్ణ, రాజేశ్వర్‌రెడ్డి, వీహెచ్‌పీ తెలంగాణ ప్రాంత సహకార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి బొల్లి రాజు, వీహెచ్‌పీ ఎల్లారెడ్డి ఖండ అధ్యక్షుడు నవీన్, బజరంగ్‌దళ్ జిల్లా సహ సంయోజక్‌లు వినోద్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట మండల కమిటీ..

నాగిరెడ్డిపేట మండల బజరంగ్‌దళ్ కమిటీని శనివారం ఏర్పాటు చేశారు. మండలాధ్యక్షుడిగా రాజిపేట సంతోష్, కార్యదర్శిగా కంచనపల్లి ప్రవీణ్‌గౌడ్, సంయోజక్‌గా మెరుపుల ఈశ్వర్‌గౌడ్, గోరక్ష ప్రముఖ్‌గా మధు సునందు, సురక్ష ప్రముఖ్‌గా భూమ శ్రీనివాస్‌గౌడ్, విద్యార్థి ప్రముఖ్‌గా పోచమ్మల ప్రవీణ్, సత్సంగ్ ప్రముఖ్‌గా గుడల రమేష్ నియమితులయ్యారు.



గోపాల్‌పేటలో యాత్రలో పాల్గొన్న ప్రజలు

ఆశా కార్యకర్తల ముందస్తు అరెస్టు



జిల్లా కేంద్రంలోని సమ్మె శిబిరంనుంచి ఆశా కార్యకర్తలను లాక్కెళ్తున్న పోలీసులు

కామారెడ్డి టౌన్: జిల్లాకేంద్రంలో శనివారం మంత్రి కేటీఆర్ బహిరంగ సభ నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయం వద్దనున్న సమ్మె శిబిరంలో ధర్నా చేస్తున్న ఆశా కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. మహిళా పోలీసులు ఆశా కార్యకర్తలను బలవంతంగా లాక్కెళ్లారు. కొందరిని దేవునిపల్లి, మరికొందరిని రామారెడ్డి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పోలీసులతో ఆశా కార్యకర్తలు వాగ్వాదానికి దిగారు. అరెస్టులను సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఖండించారు. వారి న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాల్సింది పోయి అక్రమంగా అరెస్టు చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు.

అంకితభావంతో సేవలందించాలి

- హైకోర్టు న్యాయమూర్తి పి.సామ్ కోషి

కామారెడ్డి క్రైం: సమాజంలో అవసరమున్న వారికి సహాయం అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని హైకోర్టు న్యాయమూర్తి పి.సామ్ కోషి పేర్కొన్నారు. శనివారం ఆయన కామారెడ్డిలో ఆధునికీకరించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ చాంబర్‌ను ప్రారంభించారు. అనంతరం కోర్టు హాల్‌లో జుడీషియల్ అధికారులు, కలెక్టర్, ఎస్పీ, లాయర్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీసు అధికారులు, న్యాయ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఏ ఒక్కరికీ న్యాయపరమైన సేవలకు దూరం అవుతున్నామనే భావన రాకూడదన్నారు. అందుకోసం న్యాయ విభాగాల్లో పనిచేస్తున్న వారు అంకితభావంతో సేవలందించాలన్నారు. ప్రతి జాతీయ లోక్ అదాలత్‌లో చిత్తశుద్ధితో కేసులను పరిష్కరించాలని సూచించారు. చిన్నచిన్న వివాదాలకు సంబంధించిన కేసులే ఎక్కువగా వస్తున్నాయని జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి శ్రీదేవి తెలిపారు. జిల్లా కోర్టు యూనిట్ గణాంకాలు, లోక్ అదాలత్ ద్వారా చేపట్టిన రాజీ కేసుల వివరాలను వివరించారు, వ్యాజ్యరహిత గ్రామంగా భిక్కనూరు మండలంలోని ర్యాగట్లపల్లిని ప్రకటించామన్నారు. నూతన జిల్లా కోర్టు భవన సముదాయం కోసం క్యాసంపల్లి సమీపంలో 10 ఎకరాల స్థలం కేటాయించారని, నిధులు మంజూరు కావాల్సి ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవల అథారిటీ హైదరాబాద్ సభ్య కార్యదర్శి ఎస్.గోవర్ధన్‌రెడ్డి, అదనపు జిల్లా జడ్జి లాల్‌సింగ్ శ్రీనివాస్ నాయక్, మెజిస్ట్రేట్ భార్గవి, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.శ్రీధర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పాల్గొన్నారు.



చాంబర్‌ను ప్రారంభిస్తున్న జడ్జి సామ్ కోషి

అన్నిరంగాల్లో బాన్సువాడ అభివృద్ధి

స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



తిర్మలాపూర్‌లో సొసైటీ గోడౌన్‌ను ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడరూరల్: గత పదేళ్లుగా అభివృద్ధే ఎజెండాగా బాన్సువాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్నట్లు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన బాన్సువాడ మండలం తిర్మలాపూర్‌లో రూ.2.53కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించి మాట్లాడారు. తన సొంతూరు పోచారం ఒక కన్ను అయితే తిర్మలాపూర్ తనకు రెండో కన్నుతో సమానమని అన్నారు. తాను మొదటిసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత దేవాదాయ శాఖ ద్వారా మొదటిసారి నిధులు మంజూరు చేయించింది తిర్మలాపూర్‌లోని రామాలయానికేనని గుర్తుచేశారు. గడిచిన పదేళ్లలో తిర్మలాపూర్ గ్రామానికి ప్రభుత్వం సంక్షేమానికి రూ. 16.37 కోట్లు, అభివృద్ధి పనులకు రూ.11.54కోట్లు వెచ్చించిందని చెప్పారు. అంతకు ముందు గ్రామంలో రూ.10లక్షల నిధులతో నిర్మించిన ముదిరాజ్ సంఘం భవనం, రూ.27లక్షల నిధులతో నిర్మించిన సొసైటీ గోడౌన్, రూ.18లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనంతో పాటు డ్వాక్రా సంఘం భవనం, విద్యుత్ సబ్‌స్టేషన్, గోశాల షెడ్‌లను ప్రారంభించారు. రూ.10లక్షలతో రామాలయంలో నిర్మించనున్న వంటశాల పనులకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జిన్న రఘురామయ్య, ఎంపీటీసీ సునీత మల్లారెడ్డి, ఎంపీపీ నీరజా వెంకట్రాంరెడ్డి, జెడ్పీటీసీ పద్మాగోపాల్‌రెడ్డి, నాయకులు భూషణ్‌రెడ్డి, ఎర్వాల కృష్ణారెడ్డి, మోహన్‌నాయక్, గంగుల గంగారాం, పిట్ల శ్రీధర్, ఎజాస్, పాతబాలకృష్ణ, మల్లారెడ్డి, జీవన్, తహసిల్దార్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీల సంక్షేమానికి కృషి



చెక్కులను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

కామారెడ్డి క్రైం: మైనారిటీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం కళాభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 620 మంది మైనారిటీలకు రూ.లక్ష చొప్పున రూ.6.20 కోట్ల చెక్కులను అందజేశారు. పేదల కష్టాలు తెలిసిన సీఎం కేసీఆర్ గడిచిన తొమ్మిదిన్నరేళ్లలో అన్ని వర్గాలకు న్యాయం చేసేలా పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. ప్రతి ఇంటికి అభివృద్ధి ఫలాలు అందుతున్నాయన్నారు. మైనారిటీలకు అందిస్తున్న రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని ఏదైనా వ్యాపారంలో పెట్టుబడిగా పెట్టి ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్, రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్, ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబుద్దీన్, అదనపు కలెక్టర్ చంద్ర మోహన్, మైనారిటీ సంక్షేమశాఖ అధికారి దయానంద్, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జీవో నంబర్ 46ను రద్దు చేయాలి

తెయూ(డిచ్‌పల్లి): కానిస్టేబుల్ ఉద్యోగాలకు సంబంధించి జీవో నంబర్ 46ను వెంటనే రద్దు చేయాలని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వేణురాజ్ డిమాండ్ చేశారు. తెయూ ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వద్ద రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం శనివారం చేశారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో ఏర్పడిన తెలంగాణలో కానిస్టేబుల్ ఉద్యోగాల ఫలితాల్లో అవకతవకలు జరిగాయని విమర్శించారు. కార్యక్రమంలో శ్రీశైలం, మహేశ్, అభినయ్, విజయకుమార్, రాజేందర్, రాజ్‌కుమార్, అనిల్ కుమార్, లక్ష్మణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌యూఐ నూతన కమిటీ నియామకం



తెయూ(డిచ్‌పల్లి): తెయూ ఎన్‌ఎస్‌యూఐ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు వరదబట్టు వేణురాజ్ శనివారం తెలిపారు. క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన కమిటీని ఎంపిక చేసిన వారికి నియామక పత్రాలు అందజేశారు. కొత్తగా నియామకమైన కమిటీ యూనివర్సిటీ సమస్యలపై పోరాడాలని సూచించారు. అనంతరం వర్సిటీ నుంచి కానిస్టేబుల్ ఉద్యోగం పొందిన పలువురు విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో కొమిరే శ్రీశైలం, అభినయ్, మహేశ్, విజయ్‌కుమార్, అనిల్‌కుమార్, రాజేందర్, శ్రీకాంత్, రమేశ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

జీనత్‌కు డాక్టరేట్



తెయూ(డిచ్‌పల్లి): తెయూ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో పరిశోధక విద్యార్థిని జీనత్ సుమైరా పీహెచ్‌డీ డాక్టరేట్ శనివారం సాధించారు. తెయూ ఎంబీఏ హెచ్‌వోడీ ప్రొఫెసర్ అపర్ణ పర్యవేక్షణలో 'కెమెల్ మోడల్‌ను ఉపయోగించి బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ ఆర్థిక పనితీరుపై సేవా నాణ్యత ప్రభావం-అధ్యయనం' అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. అనంతరం సుమైరాను అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఖైసర్ మహమ్మద్, రాజేశ్వరి, వాణి, కిరణ్‌కుమార్ రాథోడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేర పరిశోధనలో పోలీసులది కీలక పాత్ర



బోధన్‌టౌన్(బోధన్): నేర పరిశోధనలో పోలీసులది కీలక పాత్ర అని అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమ్మయ్య అన్నారు. బోధన్ కోర్టులో పోలీసులకు ఇన్వెస్టిగేషన్ ప్రొసీజర్ గురించి శనివారం అవగాహన కల్పించారు. కేసు దర్యాప్తులో పోలీసులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సదస్సులో ఎక్సైజ్ సీఐ రూప్‌సింగ్, ఎస్సై బాలయ్య, బాల్ సింగ్, కోర్టు పీసీలు ఉన్నారు.

ఎస్సారెస్పీలో 'ఇంటి' దొంగలు

- ప్రాజెక్టు అధికారుల కనుసన్నల్లోనే పాత సామగ్రి తరలింపు!
- తాజా ఘటనతో అధికారుల నిర్లక్ష్యం బట్టబయలు



దొంగిలించిన రోప్‌లతో వెళ్తున్న ఆటో ట్రాలీ



పోచంపాడ్ గోదాంలో నిల్వ ఉంచిన రోప్

బాల్కొండ: ఎస్సారెస్పీ అధికారుల నిర్లక్ష్యంతో ప్రాజెక్టు పాత సామగ్రి మాయమవుతోంది. ఇదంతా సంబంధిత అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోందనే ఆరోపణలు సైతం ఉన్నాయి. శుక్రవారం రాత్రి ప్రాజెక్టు దిగువన ఉన్న గోదాం నుంచి పాత రోప్‌ను గుర్తు తెలియని దుండగులు ఆటోలో ఎత్తుకెళ్తుండగా ఆటో గుంతలో కూరుకుపోయింది. దీంతో వారు ట్రాలీని వదిలి వెళ్లిపోయారు. ఉదయం గమనించిన స్థానికులు అధికారులకు సమాచారం అందించారు. కానీ పోచంపాడ్ వద్ద ఉన్న పాత భవనాలు, గోదాముల నుంచి పాత సామాగ్రిని దొంగలు ఎత్తుకెళ్లడం ఇది కొత్త కాదని, ఇదంతా ప్రాజెక్టు అధికారుల కనుసన్నల్లోనే నడుస్తోందనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తోంది. ఇది వరకు పాత భవనాలన్నున్న తలుపులు, కిటికీలు, రేకులను ఎత్తుకెళ్లారు. అయినా సంబంధిత అధికారులు ప్రాజెక్టు సామాగ్రి చోరీకి గురికాకుండా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం వరద గేట్ల మరమ్మతుల పని కొనసాగుతుండడంతో పాత సామాగ్రి అధికంగా వస్తోంది. పాత రోప్‌లు, రబ్బర్లు, గేట్లను ప్రాజెక్టు దిగువన కాకతీయ కాలువ పక్క ఉన్న గోదాంలో అధికారులు భద్రపరుస్తున్నారు. కానీ వీటికి ఎలాంటి రక్షణ చర్యలు లేకపోవడంతో దుండగులు ఎతుకెళ్తున్నారు.

కొంత కాలంగా ..

ప్రాజెక్ట్ వద్ద కొంత కాలంగా అనేక చోరీలు జరుగుతున్నాయి. నెల రోజుల క్రితం ప్రాజెక్టు ప్రాంతంలో రూ. లక్షల విలువ చేసే కలపదందాను కొందరు యథేచ్ఛగా కొనసాగించారు. ఈ ఘటన మరువకముందే గోదాం నుంచి పాత రోప్ వైర్లు ఎత్తుకెళ్లే బాగోతం బయట పడింది. ఈ చోరీలు కొత్తేం కాదని సంబంధిత అధికారుల అండతోనే దుండగులు చోరీకి పాల్పడుతున్నారని స్థానికులు బహిరంగంగానే పేర్కొంటున్నారు. ఆటో ట్రాలీ బురదలో కూరుకు పోవడం ఈ బాగోతం బయట పడింది. లేదంటే ఇలానే మరికొన్ని రోజులు దొంగతనాలు జరుగుతూ ప్రాజెక్టు సామాగ్రి మాయమవుతూనే ఉండేది. ప్రాజెక్ట్ కాలనీలో అనేక పాత వాహనాలు ఉన్నాయి. వాటిని టెండర్ నిర్వహించి విక్రయించకపోవడంతో అవితుప్పు పట్టిపోతున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి చోరీలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఫిర్యాదు చేశాం

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ వద్ద గోదాం నుంచి తరచూ జరుగుతున్న చోరీల గురించి పోలీసులకు ఫిర్యాదు చేశాం. శుక్రవారం రాత్రి జరిగిన చోరీ గురించి పోలీసులకు మళ్లీ ఫిర్యాదు చేశాం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

–చక్రపాణి, ఈఈ, ఎస్సారెస్పీ

గ్రామీణ రోడ్లకు మహర్దశ

- సంక్షేమ పథకాల్లో దేశంలోనే తెలంగాణ ఆదర్శం
- ఎమ్మెల్యే జాజాల సురేందర్



సదాశివనగర్‌లో డబుల్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్

సదాశివనగర్: అరవై ఏళ్లలో జరగని అభివృద్ధి తొమ్మిదేళ్లలోనే చేసి చూపిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో డబుల్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామీణ ప్రాంత రోడ్లకు మహర్దశ రానుందన్నారు. డబుల్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ కోసం సదాశివనగర్‌కు ఎస్‌డీఎఫ్ నిధులు రూ.2.50కోట్లు, ప్రత్యేక నిధులు రూ.95 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. అడ్లూర్ ఎల్లారెడ్డిలో డబుల్ రోడ్డు కోసం రూ.2 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. గతంలో ఉన్న అభివృద్ధిని, ప్రస్తుతం బీఆర్‌ఎస్ చేపట్టిన అభివృద్ధిని బేరీజ్ వేసుకోవాలన్నారు. సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బద్దం శ్రీనివాస్ రెడ్డి, పైడి జానకి జనార్దన్, ఉప సర్పంచ్ వంకాయల రవి, ఎంపీపీ గైని అనసూయ, జెడ్పీటీసీ కమిలి నర్సింలు, జిల్లా కో–ఆప్షన్‌మెంబర్ సయ్యద్ మొహినొద్దిన్, ఎంపీటీసీల ఫోరం మండల కన్వీనర్ పాపనొల్ల బీరయ్య, ఎంపీటీసీలు ఎడ్ల రేణుక, సంకరి లక్ష్మి రాజలింగం, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మహేందర్ రెడ్డి, భూంరెడ్డి, మర్కంటి బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.



గోపాల్‌పేట జీపీ కార్యాలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సురేందర్

నాగిరెడ్డిపేట: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే జాజాల సురేందర్ పలు అభివృద్ధి పనులను ప్రారంభించడంతోపాటు మరికొన్ని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అచ్చాయపల్లి, మెల్లకుంటతండా, పల్లెబోగుడతండా, ధర్మారెడ్డి, బంజర, వెంకంపల్లి, గోపాల్‌పేట గ్రామాల్లో గ్రామపంచాయతీ భవన నిర్మాణాల కోసం శంకుస్థాపన చేశారు. దీంతోపాటు మండలంలోని చిన్నఆత్మకూర్‌లో రైతువేదిక భవనాన్ని, మెటల్‌రోడ్డును ప్రారంభించారు. ఆత్మకూర్ గ్రామంలో ఇటీవల నూతనంగా నిర్మించిన హెల్త్‌సబ్‌సెంటర్‌ను ప్రారంభించారు. మెల్లకుంటతండా వద్ద గోదాం నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతోపాటు జప్తిజాన్కంపల్లిలో హెల్త్‌సబ్‌సెంటర్‌ను ప్రారంభించారు. మండలంలోని గోపాల్‌పేట, తండూర్ హైస్కూళ్లలో 'మన ఊరు–మన బడి' పనులను ప్రారంభించారు. మండలానికి మంజూరైన ఇంటర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన ప్రారంభించారు. బీఆర్‌ఎస్ నాయకుడు ప్రతాప్‌రెడ్డి, జిల్లా ఇంటర్ నోడల్ అధికారి షేక్‌సలాం, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ హేమంత్, జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, ఎంపీపీ రాజ్‌దాస్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సిద్ధయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నేడు ఆర్మీ జవాన్ అంత్యక్రియలు



బోధన్: సిక్కిం వరదల్లో గల్లంతై చనిపోయిన సాలూర మండలంలోని కుమ్మన్‌పల్లికి చెందిన ఆర్మీ జవాన్ నీరడి గంగాప్రసాద్ మృతదేహానికి ఆర్మీ అధికారిక లాంఛనాల ప్రకారం ఆదివారం స్వగ్రామంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి సిక్కిం రాష్ట్రంలో సంభవించిన వరదల్లో గల్లంతైన ఆర్మీ జవాన్ గంగాప్రసాద్ మృతదేహం లభ్యమైంది. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని జల్‌పాయ్‌గిరి జిల్లా ఆసుపత్రిలో ఆర్మీ అధికారులు పోస్టుమార్టం ప్రక్రియను పూర్తి చేసి మృతదేహాన్ని విమానంలో అక్కడి నుంచి శనివారం మధ్యాహ్నం హైదరాబాద్‌కు తీసుకొచ్చి ఆర్మీ క్యాంప్‌లో ఉంచారు. ఆదివారం తెల్లవారు జామున ఆర్మీ క్యాంప్ నుంచి రోడ్డు మార్గంలో కుమ్మన్‌పల్లికి తీసుకొచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆర్మీ అధికారిక లాంఛనల మేరకు అంత్యక్రియలు జరుగనున్నాయి.

అధికారులకు అవగాహన సదస్సు



ఖలీల్‌వాడి: నగరంలోని జిల్లా కోర్టులో నిజామాబాద్ డివిజన్ పోలీస్, ఎక్సైజ్ అధికారులకు అదనపు నిజామాబాద్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ భూసారపు రాజేశ్ గౌడ్ శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. కేసుల పంచనామా, చార్జిషీట్ రిమాండ్ రిపోర్టులు కోర్టులో దాఖలు చేయు విధానం, నేరస్తులకు శిక్ష పడేలా సాక్ష్యాలు సేకరించి కోర్టులో దాఖలు చేసే విధానం గురించి అవగాహన కల్పించారు. సదస్సులో డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మీనర్సయ్య, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రవి రాజ్, రాజారెడ్డి, కవిత రెడ్డి,పోలీస్‌అధికారులు,సర్కిల్‌రైటర్లు పాల్గొన్నారు.

ఈసీ తీర్మానాలు అమలు చేయాలి

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పాలకమండలి చేసిన తీర్మాణాలు కాలాయాపన చేయకుండా వెంటనే అమలు చేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తెయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జన్నారపు రాజేశ్వర్, వి.సంతోష్, జయంతి, రవీందర్, అక్షయ్ పాల్గొన్నారు.

వర్సిటీ అధ్యాపకులకు పదోన్నతులు



తెయూ(డిచ్‌పల్లి): తెయూలో విధులు నిర్వహిస్తున్న ఐదుగురు అధ్యాపకులకు శనివారం పదోన్నతులు లభించాయి. మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నసీం సీనియర్ ప్రొఫెసర్‌గా, అసోసియేట్ ప్రొఫెసర్లు సీహెచ్.అంజనేయులు, కె.రవీందర్‌రెడ్డి, సంపత్‌కుమార్, మూసాఖురేషీలు ప్రొఫెసర్లుగా పదోన్నతులు పొందారు. వీరికి రిజిస్ట్రార్ యాదగిరి పదోన్నతి ఉత్తర్వులు అందజేసి అభినందనలు తెలిపారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



తెయూ(డిచ్‌పల్లి): తెయూ రిజిస్ట్రార్, రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీత ప్రొఫెసర్ యాదగిరిని అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. తెయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కాలేజ్ సెమినార్ హాల్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రొఫెసర్ యాదగిరిని మెమొంటోతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ ఆరతి, కామర్స్ డీన్ జి.రాంబాబు, పీఆర్‌వో పున్నయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో వేగం పెంచాలి

డిచ్‌పల్లి: జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని డీఆర్‌డీవో చందర్‌నాయక్ అన్నారు. ఎన్నికల కోడ్ వచ్చే లోపు కొత్త పనులను గుర్తించి, ఎస్టిమేషన్ తయారు చేసి మంజూరు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండల కేంద్రలోని ట్రైజం ట్రైనింగ్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఉపాధి హామీ క్షేత్రస్థాయి సిబ్బందితో శనివారం నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. గ్రామాల్లో నీటి సంరక్షణ పనులను గుర్తించి సకాలంలో పూర్తి చేసేందుకు క్షేత్రస్థాయి సిబ్బంది సరైన ప్రణాళికలతో ముందుకెళ్లాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించి ఉపాధి కూలీలకు పని కల్పించకుండా వ్యవహరిస్తున్న సిబ్బందిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పనుల ప్రణాళికను నవంబరు నెలాఖరులోగా పూర్తిచేయాలని ఆదేశించారు. జిల్లాకు పండ్ల తోటల పెంపకం కోసం 1,830 ఎకరాల లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ పీడీ సంజీవ్, అసిస్టెంట్ పీడీ ఓంపాల్, జిల్లా విజిలెన్స్ అధికారి నారాయణ, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ గంగాధర్, డీఆర్‌పీ సుశీల్, హెచ్‌ఆర్ మేనేజర్ నర్సింలు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి ప్రోత్సాహం

రెంజల్(బోధన్): శాఖా గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి ప్రోత్సాహం అందిస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్ అన్నారు. ప్రతి గ్రామంలో శాఖా గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. రెంజల్‌లో నూతన గ్రంథాలయ భవణ నిర్మాణ పనులను శనివారం ప్రారంభించారు. యువత గ్రంథాలయాలను సద్వినియోగించుకుని ప్రభుత్వ ఉద్యోగాలను సాధించాలని సూచించారు. గ్రంథాలయాలు విద్యాలయాలతో సమానమన్నారు. త్వరలోనే నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచించారు. ఎంపీపీ లోలపు రజని, జడ్పీటీసీ విజయ పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత

నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలో ఇతిహాస సంకలన సమితి ఇందూరు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అశ్మక చరిత్ర గ్రంథాలయానికి చరిత్ర పుస్తకాలను జిల్లా యువజన అధికారిణి శైలి బెల్లాల్ శనివారం అందజేశారు. తన తాత స్వర్గీయ బెల్లాల్ మానిక్‌రెడ్డి జయంతి సందర్భంగా చరిత్రాత్మకమైన పుస్తకాలను అందించినట్లు తెలిపారు. అనంతరం అధికారిణి శైలి బెల్లాల్‌ను సమితి సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో కందకుర్తి ఆనంద్, మోహన్ దాస్, రిషి తదితరులు పాల్గొన్నారు.

నేడు శౌర్య జాగరణ యాత్ర

నిజామాబాద్ సిటీ: యువత పెడదోవ పడకుండా సన్మార్గంలో నడిపించేందుకు నగరంలోని మేరు భవన్‌లో ఆదివారం నిర్వహించే శౌర్య జాగరణ యాత్ర సమావేశంలో యువకులు పాల్గొనాలని వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు రెబ్బ ఆనంద్, జిల్లా సహకార్యదర్శి ధాత్రిక రమేశ్ కోరారు. నగరంలోని వినాయక్‌నగర్ అభయ ఆంజనేయ స్వామి ఆలయం నుంచి వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్‌ల ఆధ్వర్యంలో శౌర్య జాగరణ యాత్ర ర్యాలీని శనివారం నిర్వహించారు. సమావేశానికి ప్రధాన వక్తగా మహేశ్వర్‌రెడ్డి హాజరవుతారని అన్నారు.

ఆన్‌లైన్‌లో మోసం

బోధన్‌టౌన్(బోధన్): మండలంలోని పెంటకుర్దు గ్రామానికి చెందిన ఓ యువకుడు ఆన్‌లైన్‌లో రూ.2 లక్షల12 వేలకు మోసపోయినట్లు ఎస్సై నాగనాథ్ శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన ఓ యువకుడికి సెప్టెంబర్22న సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి తాము పంపిన లింక్ ఓపెన్‌చేస్తే డబ్బులు వస్తాయంటూ నమ్మించారు. మొదటగా విడతల వారీగా యువకుడి బ్యాంక్ అకౌంట్‌కు డబ్బులు పంపించారు. అధిక మొత్తంలో డబ్బులు రావాలంటే తాము చెప్పిన బ్యాంక్ అకౌంట్లకు డబ్బులు జమ చేయాలంటూ విడతల వారీగా రూ. 2లక్షల12వేలు వేయించుకున్నారు. దీంతో మోసపోయినట్లు గుర్తించిన యువకుడు పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

బోధన్‌టౌన్: సాలంపాడ్ క్యాంప్‌కు చెందిన కొండా రెడ్డి (58) కుమ్మన్‌పల్లి శివారులో విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు ఎస్సై నాగనాథ్ తెలిపారు. కొండారెడ్డి తన పొలంతో పాటు కుమ్మన్‌పల్లి శివారులో భూమిని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. శనివారం ఉదయం పొలానికి నీరుపెట్టిందుకు వెళ్లగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పోలీసుల పేరుతో బంగారం టోకరా

ఖలీల్‌వాడి: పోలీసులమని సీపీ వాహనం దాటి వస్తావా అని బాధితుడిని బెదిరించి ఆరున్నర తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లిన ఘటన జిల్లా కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. రూరల్ పీఎస్ పరిధిలోని కంఠేశ్వర్‌బైపాస్ వద్ద రోకడి హనుమాన్ సమీపంలో పోలీసులమని సీపీ వాహనం వద్ద ఆపినా ఆపకుండా వస్తున్నావని బెదిరింపులకు దిగాడు. సదరు బాధితుడు మీరెవరని ప్రశ్నించగా పోలీసు అని ఐడెంటీకార్డు తీసి చూయించారు. దీంతో బంగారం తీసి దస్తీలో పెట్టాలని బెదిరించడంతో బాధితుడు తనపై ఉన్న బంగారాన్ని తీసి దస్తీలో పెట్టాడు. అదే సమయంలో మరో బైక్‌పై వచ్చిన వ్యక్తిని సైతం బెదిరించి బ్యాగులో ఏముంది బ్యాగులో ఉన్న డబ్బులను దస్తీలో పెట్టాలని బెదిరించాడు. సీపీ ఆఫీసుకు రావాలని బాధితుడికి చెప్పి డబ్బుల బ్యాగ్‌తో వచ్చిన వ్యక్తితో దొంగ పోలీసు ఉడాయించాడు. దీంతో సదరు బాధితుడు సౌత్ సీఐ కార్యాలయానికి వెళ్లగా జరిగిన విషయాన్ని సీఐ వెంకటనారాయణకు చెప్పాడు. సీఐ వివరాలు తెలుసుకొని సీసీ టీవీపుటేజీలను పరిశీలించారు. బంగారం ఎత్తుకెళ్లిన వ్యక్తితోపాటు బ్యాగులో డబ్బులు చూయించిన వ్యక్తి ఇద్దరు ఒక్కటేనని పోలీసులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ ఒకరి మృతి

డిచ్‌పల్లి: మండలంలోని సుద్దపల్లి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మోర్తాడ్ మండలం పాలెం గ్రామానికి చెందిన గంగారాం శుక్రవారం తన బైక్‌పై సుద్దపల్లిలో బంధువు అంత్యక్రియల్లో పాల్గొని స్వగ్రామానికి వెళ్తుండగా సుద్దపల్లి శివారులో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో గంగారాం తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తమ్ముడు రాజన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆటోను ఢీకొన్న కారు

జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్ జాతీయ రహదారిపై ఆటోను కారు ఢీకొన్న ఘటనలో పాఠశాల విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయి. అర్గుల్ నుంచి విద్యార్థులు ఆటోలో జక్రాన్‌పల్లి మోడల్ స్కూల్‌కు వెళ్తుండగా జాతీయ రహదారిపై ఆటోను కారు ఢీకొన్నది. ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ విషయమై ఎస్సై తిరుపతిని వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

8 మంది బైండోవర్

మోపాల్: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 8 మంది పాత నేరస్తులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై రాము శనివారం తెలిపారు. సిర్‌పూర్, రామేశ్వర్‌పుర్ తండా, న్యాల్‌కల్, పలు గ్రామాలకు చెందిన 8 మందిని ఎన్నికల సంఘం సూచనల మేరకు బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

యువకుడి అదృశ్యం

దోమకొండ: మండలంలోని సంఘమేశ్వర్ గ్రామానికి చెందిన ఎర్వ లోకేశ్‌కుమార్ అనే యువకుడు అదృశ్యమైనట్లు ఎస్సై మురళి శనివారం తెలిపారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న లోకేశ్‌కుమార్ శుక్రవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదన్నారు. లోకేశ్ తండ్రి బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వాహనాల తనిఖీల్లో రూ.48 లక్షలు పట్టివేత

ఖలీల్‌వాడి: నగరంలోని 1, 2, 3వ టౌన్ పీఎస్ పరిధిల్లో శుక్రవారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టగా రూ. 48 లక్షలు పట్టుబడినట్లు ఎస్సైలు తెలిపారు. ఒకటో టౌన్ పీఎస్ పరిధిలోని గంజ్‌కమాన్ వద్ద తనిఖీ నిర్వహిస్తుండగా రూ.2.50 లక్షలు, 3వ టౌన్ పీఎస్ పరిధిలో రూ.3.50 లక్షలు, 2వ టౌన్ పీఎస్ పరిధిలోని పెద్దబజార్ చౌరస్తాలో రూ.42 లక్షలు సదరు వ్యక్తుల నుంచి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.